ఢిల్లీ కొత్త సీఎంగా ఆతిశీ ప్రమాణం

క్యాబినెట్‌లో అయిదుగురికి స్థానం

న్యూఢిల్లీ: ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా ఆతిశీ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమెతోపాటు ఆప్ నేతలు గోపాల్‌రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్, అహ్లావత్ క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆతిశీ ఢిల్లీకి ఎనిమిదో ముఖ్యమంత్రి కాగా, అత్యంత పిన్న వయస్కురాలైన సీఎంగా ఆమె రికార్డులకెక్కారు. అలాగే, ఢిల్లీ పీఠాన్ని అధిష్ఠించిన మూడో మహిళగానూ మరో ఘనత సాధించారు. ప్రమాణ స్వీకారానికి ముందు ఆతిశీ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశారు. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించడంతో ఆతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆతిశీ 5 నెలలు మాత్రమే ఢిల్లీ సీఎంగా ఉండనున్నారు.

కేజ్రీవాల్‌ను తిరిగి సీఎం పీఠంపై కూర్చోబెట్టాలి

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చేసిన తొలి ప్రసంగంలో ఆతిశీ తన మెంటార్, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఇప్పుడు మన ముందున్న ఏకైక కార్యం కేజ్రీవాల్‌ను తిరిగి అధికారంలోకి తేవడమేనని అన్నారు. 'ఈ రోజు ముఖ్యమంత్రిగా నేను ప్రమాణ స్వీకారం చేశా. అయితే సీఎంగా కేజ్రీవాల్ లేకపోవడం మా అందరినీ ఉద్విగ్న పరిచింది. మేమందరం ప్రస్తుతం చేయాల్సిన ఏకైక పని కేజ్రీవాల్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే' అని ఆతిశీ అన్నారు.

మీ వాటర్ ప్యూరిఫైర్ మంచిదేనా?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): నల్లా నీటి కంటే ప్యూరిఫైర్ నీరు ఆరోగ్యానికి మంచిదని మనం తాగుతూ ఉంటాం. ఆర్వో, యూవీ, ఆల్కలైన్ తదితర వెరైటీల పేరిట మార్కెట్లో ఎన్నో ప్యూరిఫైర్లు లభిస్తున్నాయి. అయితే, ప్యూరిఫైర్లు నీటిని శుద్ధిచేసే క్రమంలో శరీరానికి అత్యవసరమైన మెగ్నీషియం వంటి ఖనిజాలను కూడా వడపోస్తున్నట్టు ఇజ్రాయెల్ పరిశోధకుల తాజా అధ్యయనంలో తేలింది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం.. ప్రతీ లీటర్ నీటిలో 40 నుంచి 81 మిల్లీగ్రాముల మెగ్నీషియం అనేది కచ్చితంగా ఉండాలి. అయితే, మార్కెట్లో లభిస్తున్న చాలా ప్యూరిఫైర్ల నీటిలో అసలు మెగ్నీషియం కనిపించట్లేదని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ వివరాలు 'నేచర్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. శరీరానికి తగినంత మెగ్నీషియం అందకుంటే నాడీ సంబంధిత వ్యాధులతో పాటు మెదడుకు రక్త ప్రవాహంలో సమస్యలు, టైప్-2 డయాబెటిస్, డిమెన్షియా వచ్చే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరించారు. మెగ్నీషియం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడంతో పాటు మెగ్నీషియం ఖనిజాన్ని వడబోయని ప్యూరిఫైర్‌ను చూసి కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచించారు.

హెచ్‌ఐవీకి టీకా వచ్చేసింది!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా ఏటా పది లక్షల మంది హెచ్‌ఐవీ మహమ్మారి బారి నపడుతున్నారు. వేలాదిమంది మరణిస్తున్నారు. రోగ నిరోధక శక్తికి దొరకకుండా హెచ్‌ఐవీ వైరస్ తరచూ మ్యుటేషన్‌కు లోనవుతుండటంతో ఈ వ్యాధిని నయం చేయడం కుదరట్లేదు. శక్తిమంతమైన ఔషధాలు, ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన ఏడు వ్యాక్సిన్ డోసులతో ప్రభావం కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. దీంతో అమెరికాలోని ఎంఐటీ పరిశోధకులు హెచ్‌ఐవీ నియంత్రణకు ఓ టీకాను అభివృద్ధి చేశారు.

వారం వ్యవధిలో రెండు డోసులు

హెచ్‌ఐవీ నియంత్రణ కోసం ఈ టీకాను వారం వ్యవధిలో రెండు మోతాదులుగా ఇస్తారు. తొలి డోసులో 20 శాతం వ్యాక్సిన్‌ను, రెండో డోసులో 80 శాతం వ్యాక్సిన్‌ను రోగికి వేస్తారు. స్వల్ప వ్యవధిలో ఇచ్చే ఈ రెండు డోసులతో వైరస్ మ్యుటేషన్ జరిగేలోగా టీకా తన పనిని చేస్తుందని, రోగ నిరోధక వ్యవస్థను కూడా ఉత్తేజితం చేస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు వెల్లడించారు. 'ఇంట్రెస్టింగ్ ఇంజినీరింగ్' ఈ వివరాలను వెల్లడించింది.

ఎన్ఐటీ పాట్నాలో ఏపీ విద్యార్థిని ఆత్మహత్య

పాట్నా: బీహార్‌లోని ఎన్ఐటీ పాట్నాలో బీటెక్ చదువుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. క్యాంపస్‌లోని హాస్టల్ గదిలో శుక్రవారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నది. ఘటనా స్థలిలో పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని ఆత్మహత్య సమాచారాన్ని బంధువులకు తెలియజేశారు. అయితే బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యపై క్యాంపస్‌లోని విద్యార్థులంతా ఆందోళన నిర్వహించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వాయుసేన చీఫ్‌గా అమర్ ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ: వాయుసేనలో అపార అనుభవం, వ్యూహకర్తగా గుర్తింపు అందుకున్న ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్‌సింగ్ భారత్ వాయుసేన తదుపరి చీఫ్‌గా నియమితులయ్యారు. వాయుసేన ప్రస్తుత అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ఈ నెల 30న పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ మేరకు శనివారం రక్షణశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అమర్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్' వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా ఉన్నారు. 1964 అక్టోబర్ 27న జన్మించిన ఆయన భారత వాయుసేనలో యుద్ధ విమానాల పైలట్‌గా 1984లో కెరీర్ ఆరంభించారు. గత 40ఏండ్లుగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు.

8 హైకోర్టులకు కొత్త సీజేలు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం దేశంలోని 8 హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఎక్స్ వేదికగా ఈ వివరాలను తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ మన్మోహన్‌ను నియమించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్ షక్దర్‌ను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సురేశ్ కుమార్ కెయిత్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా పదోన్నతి లభించింది. కలకత్తా హైకోర్ట్ జడ్జి జస్టిస్ ఇంద్ర ప్రసన్న ముఖర్జీ మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కేరళ హైకోర్టు సీజేగా జస్టిస్ నితిన్ మధుకర్ జామ్‌దార్‌ను, జస్టిస్ తషి రబ్‌స్టన్‌ను జమ్ము కశ్మీర్, లడఖ్ హైకోర్టు సీజేగా నియమించారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీరామ్ కల్పతి రాజేంద్రన్‌కు మద్రాస్ హైకోర్టు సీజేగా పదోన్నతి లభించింది. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావును జార్ఖండ్ హైకోర్టు సీజేగా బదిలీ చేశారు.

భిన్నాభిప్రాయాలను సహించడమే పెద్ద పరీక్ష

- మేధావులు నిర్భయంగా అభిప్రాయాలు చెప్పాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: భిన్నాభిప్రాయాలను సహించడమే ప్రజాస్వామ్యంలో అతి పెద్ద పరీక్ష అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. పాలకుడు తనకు వ్యతిరేకంగా ఉన్న బలమైన అభిప్రాయాన్ని కూడా సహించగలడని, అది ఆత్మ పరిశీలనకు కూడా దారి తీస్తుందని ఆయన అన్నారు. పుణెలోని ఎంఐటీ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు, మేధావులు నిర్భీతిగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు. మన దేశంలో అభిప్రాయ భేదాల సమస్య లేదు కాని, అభిప్రాయ లోపం సమస్య ఉందని అన్నారు. మనం లెఫ్టిస్టులమో, రైటిస్టులమో కాదని, అవకాశవాదులమని, అందుకే రచయితలు, మేధావుల నుంచి ఎలాంటి భయం లేకుండా అభిప్రాయాలను ఆశిస్తున్నామని అన్నారు. ఎప్పుడైతే సమాజంలో అస్పృశ్యత, సాంఘిక న్యూనత, ఆధిక్యత భావనలు కొనసాగుతాయో అప్పుడు దేశ నిర్మాణం పూర్తవుతుందని చెప్పలేమని అన్నారు.

హెచ్‌ఐవీ మహిళతో హనీట్రాప్

- కర్ణాటకలోని ప్రత్యర్థి పార్టీ నేతలే లక్ష్యం
- బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నే సూత్రధారి
- రేప్ కేసు బాధితురాలి సంచలన ఆరోపణలు
- మళ్లీ అరెస్టైన మునిరత్న.. 14 రోజుల కస్టడీ
- విచారణకు సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తనపై బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న లైంగిక దాడి చేశారంటూ సంచలన ఆరోపణలు చేసిన మహిళ (40) ఇప్పుడు ఇదే కేసులో మరిన్ని కీలక విషయాలను బయట పెట్టారు. ప్రత్యర్థి పార్టీ నేతలను హనీట్రాప్ చేయడానికి మునిరత్న హెచ్‌ఐవీ సోకిన ఓ మహిళను వాడుకొన్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని మునిరత్నే తనతో స్వయంగా వెల్లడించినట్టు ఆమె చెప్పారు. 'నా ప్రత్యర్థి పార్టీలోని ఓ నేతను బుట్టలోకి దింపడానికి హెచ్‌ఐవీ సోకిన మహిళను హనీట్రాప్ కోసం వాడుకొన్నా. ఇంకో నేతను కూడా ఇలాగే ముగ్గులోకి దింపడానికి మరో హెచ్‌ఐవీ సోకిన మహిళ నాకు కావాలి. సాయం చేస్తావా?' అంటూ మునిరత్న తనను అడిగినట్టు సదరు మహిళ ఆరోపించారు. ఈ మేరకు తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, అయితే కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించినట్టు బాధితురాలు పేర్కొన్నారు.

విచారణకు సిట్ ఏర్పాటు

మునిరత్నపై నమోదైన కేసుల విచారణకు కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. అడిషనల్ డీజీపీ(సీఐడీ) బీకే సింగ్ నేతృత్వంలో ఐపీఎస్ అధికారులు లభురామ్, సౌమ్యలత, సీఏ సైమన్‌తో సిట్‌ను నియమించింది. కాగా, వారం వ్యవధిలో మునిరత్నపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఓ మహిళపై లైంగిక దాడి, ఓ కాంట్రాక్టర్‌ను కులం పేరిట దూషించిన ఆరోపణలతో ఇప్పటికే రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తాజాగా రేప్ కేసులో మూడో ఎఫ్ఐఆర్ నమోదైంది. దళితులపై దుర్భాషలాడిన కేసులో బెయిల్‌పై బయటకొచ్చిన మునిరత్నను.. ఈ రేప్ కేసులో పోలీసులు మళ్లీ అరెస్టు చేశారు. ఆయన్ని 14 రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ శనివారం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీలో అంతర్మథనం

మునిరత్నపై వస్తున్న వరుస ఆరోపణలపై రాష్ట్ర బీజేపీ నేతలు ఆచితూచి మాట్లాడుతున్నారు. ఈ విషయంపై కేంద్ర నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చి చెప్తున్నారు. 'మునిరత్నపై ఏ నిర్ణయాన్నైనా కేంద్ర నాయకత్వమే తీసుకోవాలి' అని కర్ణాటక బీజేపీ క్రమశిక్షణ కమిటీ ప్రెసిడెంట్ లింగరాజ్ పాటిల్ అన్నారు.

మంత్రిగా డీకే విఫలం

- 15 రోజుల్లో గుంతలు పూడ్చుతానన్నారు
- హామీని మరచి అమెరికాలో చక్కర్లా?
- ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ ఫైర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఓ మంత్రిగా ఫెయిల్ అయ్యారని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ తీవ్రంగా మండిపడ్డారు. బెంగళూరు రోడ్లమీద ఉన్న గుంతలను 15 రోజుల్లోగా పూడ్చుతానంటూ వాగ్దానం చేసిన డీకే.. హాలీడే పేరిట అమెరికాలో షికారు చేస్తున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

ఇక నమ్మడం ఎలా?

ఇటీవలి వర్షాలతో బెంగళూరు రోడ్లన్నీ గుంతలమయమైనట్లు వచ్చిన ఫిర్యాదులపై డీకే ఈ నెల 1న స్పందించారు. 15 రోజుల్లోగా గుంతలన్నింటినీ పూడ్చేయాలని బీబీఎంపీ అధికారులను ఆదేశించారు. పనులు జరగకపోతే కఠిన చర్యలు తీసుకొంటానని హెచ్చరించారు. కానీ పరిస్థితి యథాతథంగా కొనసాగుతుండటంతో వాహనదారుల అవస్థలను బీజేపీ ఎంపీ పీసీ మోహన్ బుధవారం ఎక్స్ వేదికగా వివరించారు.

ఔషధాల కొనుగోళ్లలోనూ అక్రమాలు

వెలుగులోకి సందీప్ ఘోష్ అక్రమాలు

కోల్‌కతా: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన జరిగిన ఆర్జీ కర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రోగులకు అందించే ఔషధాల కొనుగోళ్లలో సందీప్ ఘోష్ అవకతవకతకు పాల్పడ్డాడని సీబీఐ ఆరోపించింది. సరఫరా చేసే సంస్థల సాంకేతికత మూల్యాంకనం చేయకుండానే టెండర్లు ఖరారు చేశాడని పేర్కొన్నది.

పాక్షికంగా విధుల్లో చేరిన జూడాలు

జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా 42 రోజుల పాటు విధులు బహిష్కరించి ఆందోళన చేసిన పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లు శనివారం పాక్షికంగా విధుల్లో చేరారు. ప్రభుత్వ దవాఖానల్లో ఔట్ పేషెంట్ విభాగాలు మినహా మిగతా సేవలకు హాజరయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలకు సైతం హాజరవుతున్నామని వారు ప్రకటించారు. కాగా, తమ డిమాండ్లను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి మరో వారం పాటు వేచి చూస్తామని తెలిపారు.

రక్తదానం చేయకున్నా చేసినట్టు పోజు

మొరాదాబాద్ మేయర్‌పై విమర్శలు

మొరాదాబాద్: ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 17న నిర్వహించిన రక్తదాన శిబిరం అభాసుపాలైంది. మొరాదాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆ పార్టీ సీనియర్ నేత, స్థానిక మేయర్ వినోద్ అగర్వాల్ రక్తదానం చేయకపోయినప్పటికీ చేసినట్టుగా కెమెరా ముందు నటించి అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆయన రక్తపోటును పరిశీలించేందుకు ఓ ఆరోగ్య సంరక్షణ కార్యకర్త సిద్ధమవడంతో ఆ ప్రక్రియను కొనసాగించవద్దని ఆయన వైద్యుడిని కోరారు. ఆ తర్వాత ఆ వైద్యుడు సూదిని బయటకు తీయగానే అగర్వాల్ మంచం దిగి ఆ గది నుంచి వెళ్లిపోయారు. కెమెరా కోసం నకిలీ రక్తదానం చేశారంటూ పలువురు ఆయనపై విమర్శలు గుప్పించారు.

పరీక్షల్లో అక్రమాల భయంతో మొబైల్ ఇంటర్నెట్ బంద్

జార్ఖండ్ ప్రభుత్వం నిర్ణయం

రాంచి, సెప్టెంబర్ 21: శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు పుకార్లు వ్యాపించకుండా మొబైల్ ఇంటర్నెట్‌ను బంద్ చేయడం గురించి చాలాసార్లు విన్నాం. కానీ, జార్ఖండ్ ప్రభుత్వం మాత్రం పరీక్షల్లో అక్రమాల భయంతో మొబైల్ ఇంటర్నెట్‌ను ఆపేయాలని నిర్ణయించింది. పరీక్షల కోసం ఇలాంటి ముందు జాగ్రత్త చర్య తీసుకోవడం బహుశా దేశంలో ఇదే మొదటిసారి. జార్ఖండ్ జనరల్ గ్రాడ్యుయేట్ లెవెల్ కంబైన్డ్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్(జేజీజీఎల్‌సీసీఈ) పరీక్షలు శనివారం, ఆదివారాల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పరీక్ష జరిగే రెండు రోజులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, టెలిగ్రామ్, ట్విట్టర్ వంటి మొబైల్ యాప్‌లను ఉపయోగించి గతంలో కొందరు అక్రమాలకు పాల్పడ్డట్టు గుర్తించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కోర్ట్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గ్రీన్‌కార్డుల కాల పరిమితి పొడిగింపు

36 నెలలకు పెంచిన అమెరికా

న్యూయార్క్, సెప్టెంబర్ 21: గ్రీన్ కార్డులు లేదా పర్మినెంట్ రెసిడెంట్ కార్డులు ఉండి వాటి రెన్యువల్ కోసం ఎదురుచూస్తున్న పౌరులు, వలసదారులకు అమెరికా శుభవార్త చెప్పింది. వారి పర్మినెంట్ రెసిడెంట్ కార్డుల చెల్లుబాటు కాలాన్ని మరింత పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. గతంలో ఈ కార్డుల కాల పరిమితి ముగిసిన తర్వాత మరో 24 నెలలు పొడిగించేవారు. ఇప్పుడు దానిని 36 నెలలకు పెంచారు. సాధారణంగా గ్రీన్‌కార్డు దారులు ప్రతీ ఐదేళ్లకోసారి వాటిని రెన్యువల్ చేసుకోవాలి. దానికోసం వారు ఐ-90 ఫామ్‌ను సమర్పించాలి.

చట్టబద్ధమైన శాశ్వత నివాసితులై ఫామ్ ఐ-90ని సమర్పించిన వారి శాశ్వత నివాసి కార్డులు లేదా గ్రీన్ కార్డు చెల్లుబాటును 36 నెలల పాటు పొడిగిస్తున్నట్టు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. దీంతో రెన్యువల్ కోసం వేచి చూస్తున్న వారికి ఇది ఎంతో ఉపశమనం కలిగించింది. ఈ నిర్ణయం ఈ ఏడాది సెప్టెంబర్ 10 నుంచి అమలులోకి వస్తున్నట్టు తెలిపింది. గ్రీన్ కార్డు గడువు ముగిసిన వారికి, పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. గడువు ముగిసిన గ్రీన్ కార్డుల రెన్యువల్‌కు ఏడు నుంచి 12 నెలల సమయం పడుతుంది. దాంతో అది వచ్చేవరకు పౌరులకు టెన్షన్ తప్పేది కాదు. ఈ ఎదురుచూపులకు అడ్డుకట్ట వేయడానికే గడువును 36 నెలలు పొడిగిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. గ్రీన్‌కార్డు దారులు అమెరికాలో ఎక్కడైనా ప్రయాణించడానికి అర్హులు. దేశం వెలుపల ఏడాది గడిస్తే వారి గ్రీన్ కార్డు గడువు ముగుస్తుంది. దాని పునరుద్ధరణ కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్త విధానం ప్రకారం గ్రీన్ కార్డు పొడిగింపునకు అందుకున్న నోటీసుతో పాటు, గడువు ముగిసిన గ్రీన్ కార్డును రుజువుగా చూపెడుతూ వారు తామున్న చోట కొనసాగవచ్చు.

విద్యావంతులైన వలసదారుల్లో మనోళ్లే టాప్

అమెరికాలో విద్యావంతులైన వలసదారుల్లో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నట్టు మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్(ఎంపీఐ) అనే సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. 2022 నాటికి అమెరికాలో 1.40 కోట్ల మంది వలసదారులైన విద్యావంతులు ఉన్నారు. వీరిలో భారతీయులు 14 శాతం ఉన్నారని, ఆ తర్వాత చైనీయులు 7.9 శాతం, ఫిలిప్పిన్స్‌కు చెందిన వారు 6.9 శాతం ఉన్నారని ఎంపీఐ తెలిపింది. హెచ్-1బీ పొందుతున్న వారిలోనూ భారతీయుల సంఖ్య గణనీయంగా ఉందని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆమోదించిన పిటిషన్లలో భారతీయులవే 72 శాతం ఉన్నట్టు తెలిపింది.

ఎన్పీఏ డైరెక్టర్‌గా అమిత్ గార్గ్

ఎన్సీఆర్బీ డైరెక్టర్‌గా అలోక్ రంజన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ(ఎన్పీఏ) డైరెక్టర్‌గా అమిత్ గార్గ్ నియమితులయ్యారు. ఆయన 1993 బ్యాచ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) డైరెక్టర్‌గా మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అలోక్ రంజన్ నియమితులయ్యారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక డైరెక్టర్లుగా రిత్విక్ రుద్ర, మహేశ్ దీక్షిత్, ప్రవీణ్ కుమార్, అర్వింద్ కుమార్, సీఐఎస్ఎఫ్ స్పెషల్ డీజీగా ప్రవీర్ రంజన్, సీఆర్పీఎఫ్ స్పెషల్ డీజీగా వితుల్ కుమార్, బీఎస్ఎఫ్ స్పెషల్ డీజీగా ఆర్ ప్రసాద్ మీనాను కేంద్రం నియమించింది.

పూరీ రత్న భండార్‌లో రెండో విడత సర్వే

పూరి: ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని మరోసారి తెరిచారు. ఇందులో రెండో విడత సర్వేను భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) శనివారం ప్రారంభించింది. రత్న భాండాగారంలోని నిధి నిక్షేపాల వెలికితీత, సంపద అన్వేషణకు ఉద్దేశించిన ఈ సర్వే వల్ల మూడు రోజుల పాటు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తోబుట్టువుల దేవతల దర్శనాన్ని భక్తులకు నిషేధించారు. అలాగే ఈ సర్వే సమయంలో ఆలయ ప్రధాన ద్వారాలను మూసివేస్తారు. ఆలయ రత్న భాండాగారంలో ఏదైనా రహస్య చాంబర్ లేదా సొరంగం ఉన్నదా? అన్న అంశాన్ని ఈ సర్వేలో పరిశీలిస్తారు.

భూగర్భంలోకి చొచ్చుకెళ్లి 'లక్ష్యం' పూర్తి

నిఘా సమాచారంతోనే హెజ్బొల్లా కమాండర్ హతం

బీరుట్‌పై దాడి ఘటనలో 37కి చేరిన మృతుల సంఖ్య

దాడి జరిగిన ప్రాంతం, అకీల్

జెరూసలేం: ఇజ్రాయెల్ సైన్యాధ్యక్షుడు హెర్జి హలేవీ ప్రస్తుతం ఉత్తర ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఇంతలో ఆయనకు నిఘా వర్గాల నుంచి ఓ సమాచారం వచ్చింది. ఇది 'వదులుకోరాని అవకాశం' అని, తక్షణమే దాడి చేయాలని హెర్జి ఆదేశించారు. అంతే.. వెంటనే ఇజ్రాయెల్ దళాలు బీరుట్‌లోని దహియాహ్ నైబర్‌హుడ్‌లో 8 అంతస్థుల నివాస భవనం పార్కింగ్ స్థలంపై పైకి నాలుగు క్షిపణులను కురిపించాయి. దీంతో భూగర్భంలో 20 మంది కమాండర్లతో సమావేశమైన హెజ్బొల్లా అగ్రస్థాయి ఉగ్రవాది ఇబ్రహీం అకీల్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఇంతకీ ఈ నిఘా సమాచారం ఏమిటంటే, అకీల్‌తోపాటు హెజ్బొల్లాకు చెందిన టాప్ రద్వన్ దళాల ఉగ్రవాదులు సమావేశమయ్యారని, వీరు ఇజ్రాయెల్‌లోని గలీలీ ప్రాంతంపై దాడి చేయడం కోసం చర్చిస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్పాయి. ఇజ్రాయెల్ తక్షణమే స్పందించి కురిపించిన క్షిపణులు మొదటి భవనాన్ని నేలమట్టం చేసి, రెండో భవనాన్ని చీల్చుకుంటూ భూగర్భంలోకి చొచ్చుకెళ్లి 'లక్ష్యాన్ని' పూర్తి చేశాయి. ఈ దాడిలో అకీల్ సహా 37 మంది మరణించినట్లు, వీరిలో ఏడుగురు మహిళలు, ముగ్గురు బాలలు ఉన్నట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. ఈ ఘటనలో 68 మంది గాయపడగా, 15 మంది దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పింది. ఉగ్రవాదులు తమకు రక్షణ కవచంగా సామాన్యులను ఉపయోగించుకుంటున్నారని ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు.

టాప్ కమాండర్లను మట్టుబెట్టాం: ఐడీఎఫ్

హెజ్బొల్లాకు చెందిన రద్వన్ ఫోర్స్ టాప్ కమాండర్లలో ఇద్దర్ని శుక్రవారం మట్టుబెట్టామని ఇజ్రాయెల్ దళాలు శనివారం ధ్రువీకరించాయి. హెజ్బొల్లా క్షేత్ర స్థాయి సైనిక కార్యకలాపాలను రద్వన్ ఫోర్స్ నిర్వహిస్తుందని చెప్పింది. ఈ దళంలోని అకీల్ టాప్ కమాండర్లలో రెండోవాడని తెలిపింది. ఇతనితోపాటు మరో సీనియర్ కమాండర్‌ను, 14 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు వివరించింది.

స్పామ్ మెసేజ్‌లకు చెక్

వాట్సాప్‌లో త్వరలో కొత్త ఫీచర్

గురుగ్రామ్, సెప్టెంబర్ 21: చికాకు పెట్టించే స్పామ్ మెసేజ్‌లకు చెక్ పెట్టే కొత్త ఫీచర్‌ను వాట్సాప్ త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నది. 'బ్లాక్ అన్‌నోన్ అకౌంట్ మెసేజెస్' అనే ఈ ఫీచర్ ద్వారా అన్‌నోన్(తెలియని నెంబర్లు) అకౌంట్ల నుంచి మెసేజ్‌లు రాకుండా బ్లాక్ చేయవచ్చు. ఈ ఫీచర్‌ను ఉపయోగించి గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే స్పామ్ మెసేజ్‌లకు అడ్డకట్ట వేయొచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ పలువురు బెటా టెస్టర్లకు వాట్సాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలోనే వినియోగదారులు అందరికీ ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నది. వాట్సాప్ అకౌంట్‌కు ఈ ఫీచర్ రక్షణగా ఉంటుందని, డివైజ్ పనితీరును మెరుగుపరుస్తుందని వాట్సాప్ తెలిపింది.



తిరుమల లడ్డూ కల్తీని తీవ్రంగా పరిగణిస్తున్నాం

తార్కిక ముగింపు ఇస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్బళి: కల్తీ కారణంగా తిరుమల శ్రీవారి లడ్డూ అపవిత్రం అయ్యిందని వస్తున్న ఆరోపణలపై కేంద్రం స్పందించింది. లడ్డూ కల్తీ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనికొక తార్కిక ముగింపును ఇస్తామని కేంద్ర ఆహార, వినియోగదారుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. హుబ్బళిలో శనివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందిని నెయ్యి వాడకాన్ని నిలిపివేసిన అనంతరం టీటీడీపై ఆరోపణలు వచ్చాయని తెలిపారు. నెయ్యి కల్తీపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు.

అయోధ్యలో తిరుపతి లడ్డూలే పంచాం

ఈ ఏడాది జనవరిలో అయోధ్య దేవాలయ ప్రతిష్ఠ ఉత్సవంలో భక్తులకు తిరుపతి లడ్డూలనే ప్రసాదంగా పంపిణీ చేసినట్టు ఆ ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. మరోవైపు కల్తీ నెయ్యికి సంబంధించిన వివాదంలో తమ కంపెనీని లాగడం పట్ల గుజరాత్‌కు చెందిన అమూల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లడ్డూ తయారీలో తాము సరఫరా చేసిన నెయ్యిని వాడినట్టు ప్రచారం జరగడాన్ని ఖండిస్తూ దీనిపై చర్య తీసుకోవాలంటూ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చైనాలో మాజీ మహిళా గవర్నర్‌కు 13 ఏండ్ల జైలు శిక్ష

సిబ్బందితో లైంగిక సంబంధాలు, లంచాలే కారణం

బీజింగ్, సెప్టెంబర్ 21: నైరుతి చైనా 'గిజో' ప్రావిన్స్‌లో అత్యున్నత స్థాయి అధికారిణి, 'బ్యూటిఫుల్ గవర్నర్'గా పేరొందిన 52 ఏండ్ల జాంగ్ యాంగ్‌కు 13 ఏండ్ల జైలు శిక్ష విధించారు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తా కథనం ప్రకారం, తన కింద పనిచేసే 58 మంది సిబ్బందితో ఆమె లైంగిక సంబంధాలు కలిగి ఉన్నారని, 60 మిలియన్ యువాన్లు (సుమారుగా రూ.70 కోట్లు) లంచాలుగా తీసుకున్నారని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. దీంతో అక్కడి ప్రభుత్వం ఆమెకు జైలు శిక్షను విధించింది. అంతేగాక ఆమెకు 10 లక్షల యువాన్ల జరిమానా కూడా విధించినట్టు తెలిసింది. ప్రావిన్స్‌లో స్వతంత్ర హోదా కలిగిన ఓ ప్రాంతానికి గవర్నర్‌గా వ్యవహరిస్తున్న ఆమెపై ఈ ఏడాది ఏప్రిల్‌లో వేటు పడింది.

మణిపూర్‌లోకి 900 మంది కుకీ మిలిటెంట్లు!

2 చోట్ల ఆయుధాలు స్వాధీనం

న్యూఢిల్లీ: మయన్మార్ నుంచి దాదాపు 900 మంది కుకీ మిలిటెంట్లు మణిపూర్‌లోకి చొరబడబోతున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించినట్లు మణిపూర్ భద్రతా సలహాదారు కుల్‌దీప్ సింగ్ తెలిపారు. చురచాంద్‌పూర్, తౌబల్‌లో జరిపిన దాడుల్లో సాధారణ ఆయుధాలతో పాటు, పిస్తోళ్లు, రైఫిల్ వంటి ఆయుధాలతో పాటు యుద్ధరంగంలో వినియోగించే రాకెట్లు, మోర్టార్ బాంబులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగా, మయన్మార్‌లోని చిన్ తెగవారితో మణిపూర్‌లోని కుకీ తెగ వారికి సంబంధాలు ఉన్నాయి. కుకీ మిలిటెంట్లు డ్రోన్ దాడులకు పాల్పడినట్లు అధికారులు ఆరోపించారు.